సాక్షి సంగారెడ్డి

ఆదివారం। 1। సెప్టెంబర్। 2024

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి జోన్: అర్హులైన నిరుద్యోగ ఎస్సీ యువతకు పలు కోర్సుల్లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు తీసుకుంటున్నట్లు జిల్లా అధికారి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవ సహకార అభివృద్ధి సంఘం, తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. 18 –35 ఏళ్ల లోపు వారికి డ్రైవింగ్ శిక్షణలో భాగంగా (లైట్ మోటార్ వెహికల్, హెవీ మోటార్ వెహికల్) 38 రోజులపాటు శిక్షణ ఇచ్చి డ్రైవింగ్ లైసెన్స్‌లు అందించనున్నామని తెలిపారు. ఆసక్తి గలవారు విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, పాన్ కార్డు, మీసేవా కేంద్రాల్లో జారీ చేసిన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో సెప్టెంబర్ 20 లోపు సంగారెడ్డి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

నెలరోజులపాటు పోలీస్ యాక్ట్ అమలు

ఎస్పీ చెన్నూరి రూపేశ్

సంగారెడ్డి జోన్: జిల్లా వ్యాప్తంగా సెప్టెంబర్ 1 నుంచి 30 వరకు పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ చెన్నూరి రూపేశ్ శనివారం పేర్కొన్నారు. జిల్లాలో ఎక్కడా కూడా అనుమతులు లేకుండా ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు ధర్నాలు, నిరసనలు, రాస్తారోకోలు, పబ్లిక్ మీటింగ్ వంటి కార్యక్రమాలు చేపట్టరాదని సూచించారు. అనుమతులు లేకుండా సమావేశాలు నిర్వహిస్తే శాఖ పరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

సంక్షేమ పథకాలపై సమీక్ష



ఏపీడీ జంగారెడ్డి

జహీరాబాద్: పలు సంక్షేమ పథకాలపై గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఏపీడీ జంగారెడ్డి సమీక్ష నిర్వహించారు. శనివారం జహీరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో బ్యాంకు లింకేజీ, మైక్రో ఎంటర్ ప్రైజెస్, మహిళా శక్తి, పశు సంపద, పౌల్ట్రీ, క్యాంటీన్, మదర్ యూనిట్, రోజు వారి ఎస్‌హెచ్‌జీ సమావేశాలతో పాటు పలు అంశాలపై సమీక్ష చేశారు. సమావేశంలో డీపీఎంలు శ్రీనివాస్, జయశ్రీ, రవీందర్, డివిజన్ పరిధిలోని ఏడు మండలాలకు చెందిన ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పంపింగ్



మల్లన్న సాగర్‌లోకి గోదావరి జలాలు

తొగుట(దుబ్బాక): కొమురవెల్లి మల్లన్న సాగర్ రిజర్వాయర్‌లోకి గోదావరి జలాల పంపింగ్ కొనసాగుతోంది. నాలుగు మోటార్ల ద్వారా 5 రోజుల్లో 2.30 టీఎంసీల నీటిని పంపింగ్ చేసినట్లు ప్రాజెక్టు డీఈ చెన్ను శ్రీనివాస్ తెలిపారు. ఇందులో 1.50 టీఎంసీల నీటిని కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్‌కు తరలించారు. మల్లన్న సాగర్‌లో ప్రస్తుతం 0.80 టీఎంసీల నీరు చేరడంతో 11.10 టీఎంసీలకు చేరింది. కాగా గోదావరి నదిలో వరద ఉధృతి కొనసాగుతుండగా మల్లన్న సాగర్‌కు పంపింగ్ జరుగుతోంది.

హైడ్రా హల్‌చల్

అమీన్‌పూర్‌లోని మూడు చెరువులను పరిశీలించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్

పటాన్‌చెరు: పటాన్‌చెరు మండలం అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ శనివారం సుడిగాలి పర్యటన నిర్వహించారు. అమీన్‌పూర్‌లోని శంభునికుంట, శంబిచెరువు, చక్రపురికాలనీలోని వివాదాస్పద భూమిని పరిశీలించారు. చెరువుల ఆక్రమణలపై అధికారులతో ఆరా తీశారు. చెరువు ఆక్రమణల తాజా పరిస్థితి, వాటిపై ఉన్న కేసులు ఇతరత్రా అంశాల గురించి అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.





అమీన్‌పూర్ పరిధిలోని శంభుని కుంట ఆక్రమణలపై హైడ్రా కమిషనర్‌కు వివరిస్తున్న అధికారులు / చక్రపురి కాలనీవాసులతో మాట్లాడుతున్న కమిషనర్

ఆటాడుకుందాం రా...!



- క్రీడలపై పెరుగుతున్న ఆసక్తి
- పటాన్‌చెరు నియోజకవర్గంలో మైదానాలకు భారీ డిమాండ్
- స్థలాలను అద్దెకిస్తున్న నిర్వాహకులు
- అభివృద్ధికి నోచుకోని ప్రభుత్వ మైదానాలు

చిన్నారులు, యువకులు విద్యతోపాటు క్రీడల్లో ఆసక్తి చూపిస్తున్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో నిరంతరం మైదానాలకు వెళ్లి శిక్షణలను తీసుకుంటున్నారు. ఈ క్రమంలో పటాన్‌చెరు నియోజకవర్గంలో క్రీడా మైదానాలు కిక్కిరిసిపోతున్నాయి. మైదానాలకు డిమాండ్ పెరగడంతో కొందరు నిర్వాహకులు అద్దెకు ఇస్తున్నారు.



పర్స శ్రీనాథ్
రామచంద్రాపురం (పటాన్‌చెరు)

10లో

అప్రమత్తంగా ఉండండి

- భారీ వర్షాల నేపథ్యంలో అధికారులకు కలెక్టర్ ఆదేశం
- కంట్రోల్ రూం ఏర్పాటు
- అధికారులు హెడ్‌క్వార్టర్‌లోనే ఉండాలని ఆదేశం

సంగారెడ్డి జోన్: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి ఆదేశించారు. శనివారం జిల్లా ఎస్పీ, మున్సిపల్ కమిషనర్లు , పంచాయతీరాజ్ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రానున్న 48 గంటలలో జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసిన నేపథ్యంలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పక్క రాష్ట్రాలలో భారీగా వర్షాలు పడే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాన్నారు. పక్క రాష్ట్రాల నుంచి భారీ వరద వచ్చే అవకాశం ఉందన్నారు. నారాయణఖేడ్, జహీరాబాద్ డివిజన్లో అధికారులు వెంటనే అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అమీన్‌పూర్, బొల్లారం ఏరియాలో కొంత రెడ్ అలర్ట్ ఉన్నట్లు తెలిపారు. అధికారులు తాము పనిచేసే హెడ్‌క్వార్టర్లోనే ఉండాలన్నారు. మండలాల్లో ప్రమాదకరమైన ప్రాంతాలను గుర్తించాలని, పొంగే వాగులు, ప్రమాదకరమైన కల్వర్టులు, చెరువులు ప్రదేశాలను గుర్తించి ముందుగానే రిస్క్యూ టీం ఏర్పాటు చేసి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలలన్నారు. ఎక్కడైనా ప్రజలకు ఇబ్బందులు ఎదురైతే వెంటనే కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్: 08455 276155కు సమాచారం అందించాలని సూచించారు. వర్షం ప్రభావిత ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టేలా ఆయా శాఖల అధికారులను, అప్రమత్తం చేసినట్లు వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు మాధురి పాల్గొన్నారు.



బ్యాంకు అధికారులను హెచ్చరిస్తున్న కలెక్టర్

పనితీరు మార్చుకోవాలి

బ్యాంక్ అధికారులకు కలెక్టర్ హెచ్చరిక

కంది(సంగారెడ్డి): బ్యాంకుకు వచ్చే ఖాతాదారులను ఇబ్బందులు కలిగించవద్దని, వారికి అర్థమయ్యేలా మాట్లాడాలని కలెక్టర్ క్రాంతి వల్లూరు సూచించారు. శనివారం కంది మండలంలో కలెక్టర్ పర్యటించారు. ఈ సందర్భంగా ఇంద్రకరణ్లో ఏపీజీవీబీ బ్యాంకులో గ్రామ రైతులు, అధికారులతో రుణమాఫీ సమస్యపై సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ బ్యాంకు మేనేజర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, రుణం ఉందన్న కారణంతో ప్రభుత్వం అందజేసే ఆసరా పింఛన్లు, రైతుబంధు డబ్బులను ఇవ్వడం లేదన్నారు. స్పందించిన కలెక్టర్.. బ్యాంక్ అధికారులు పనితీరు మార్చుకోవాలని చెప్పారు. అంతకు ముందు కందిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. రోగులతో మాట్లాడి సేవలపై ఆరా తీశారు. సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. అలాగే.. తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించి ధరణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సూచించారు. మైనార్టీ బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించి మెనూ పక్కాగా అమలు చేయాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

అక్రమార్కునికి చుక్కెదురు..!

- జిల్లాలో బదిలీ అయిన స్థానంలో చేరకుండా..
- హైదరాబాద్‌కు సమీప జిల్లాలో పోస్టింగ్ కోసం ప్రయత్నాలు
- ఈఎన్‌సీ ఉన్నతాధికారులు విముఖత
- చర్చనీయాంశంగా అధికారి పనితీరు..



నీటిపారుదలశాఖ కార్యాలయాల కాంప్లెక్స్

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: నీటిపారుదలశాఖలో ఏళ్ల తరబడి ఒకే చోట పాతుకుపోయి ఇటీవలే బదిలీ వేటు పడిన ఓ ఇంజనీరింగ్ ఉన్నతాధికారి మళ్లీ మంచి పోస్టింగ్ కోసం చేస్తున్న ప్రయత్నాలు బెడిసి కొట్టాయి. జిల్లాలో మారుమూల ప్రాంతానికి బదిలీ అయిన సదరు అధికారి అక్కడ విధుల్లో చేరకుండా హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న జిల్లాలో పోస్టింగ్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈఎన్‌సీ స్థాయిలో పైరవీలు చేస్తున్నారని సమాచారం. అయితే ఈ పోస్టింగ్ ఇచ్చేందుకు ఈఎన్‌సీ ఉన్నతాధికారులు విముఖత వ్యక్తం చేసినట్లు ఆశాఖ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయినప్పటికీ ఈ అధికారి జిల్లాలో బదిలీ చేసిన స్థానంలో చేరకుండా సెలవు పెట్టి వెళ్లిపోయారు. సుమారు ఏడేళ్ల పాటు కీలక పోస్టులో పాతుకు పోయిన ఆయన జిల్లాలో చెరువుల కబ్జాదారులకు పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. చెరువులు, కుంటల కబ్జాలపై ఎన్ని ఫిర్యాదులు అందినా ఆయన వాటిపై చర్యలు తీసుకోకుండా ఏళ్ల తరబడి జాప్యం చేస్తూ వచ్చారు. మరోవైపు చెరువులకు విచ్చలవిడిగా ఎన్‌ఓసీలు మంజూరు చేస్తూ కూడా సహకరించారు. ఇలా ఈ అధికారి తీరుపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. వీటిపై అంతర్గత విచారణ చేపట్టిన ఆశాఖ ఇటీవల బదిలీ వేటు వేసింది. ఈ ఒక్క అధికారినే బదిలీ చేస్తూ ప్రత్యేకంగా ఉత్తర్వులు జారీ చేయడం జిల్లాలో ఆశాఖ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రంలో చెరువులు, కుంటల కబ్జాలపై ప్రస్తుత ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిన విషయం విదితమే. ఈ క్రమంలో పటాన్‌చెరు నియోజకవర్గంలోని పలు చెరువులు, కుంటల ఆక్రమణలను హైడ్రా బృందం పరిశీలించింది. ఈ తరుణంలోనే కొన్నేళ్లుగా ఈ చెరువులు కుంటల కబ్జాలకు సహకరించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈ అధికారిపై బదిలీ వేటు వేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఆశాఖలోని మరికొందరు అక్రమార్కుల గుండెల్లోనూ రైళ్లు పరుగెడుతున్నాయి.

'నారింజ'కు వరద

- షటర్లపై నుంచి దిగువకు పారుతున్న నీరు



వరద పరిస్థితిని తెలుసుకుంటున్న నీటిపారుదల శాఖ అధికారులు

జహీరాబాద్: జహీరాబాద్ ప్రాంతంలో శనివారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి నారింజ ప్రాజెక్టులోకి వరద వచ్చి చేరుతోంది. ఉదయం నీటిపారుదల శాఖ ఏఈ జానకీరాం, అధికారులు మండలంలోని కొత్తూర్(బి) గ్రామ శివారులో గల ప్రాజెక్టును సందర్శించారు. ఎగువ ప్రాంతం నుంచి ఏ మేరకు వరద వచ్చి చేరుతున్నదనే విషయాన్ని పరిశీలించారు. ప్రాజెక్టు సామర్థ్యం 0.85 ఎంపీఎఫ్‌టీగా ఉంది. శనివారం కోహీర్ మండలంలో 2.3 సెం.మీ, మొగుడంపల్లిలో 1.2 సెం.మీ, జహీరాబాద్ మండలంలో 1.7 సెం.మీ మేర వర్షం కురిసింది. దీంతో ప్రాజెక్టులోకి ఇన్ ఫ్లో 390 క్యూసెక్కులు, అదే స్థాయిలో ఔట్ ఫ్లో ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. ప్రాజెక్టు షటర్ల పైనుంచి 6 ఇంచుల మేర వరద దిగువన ఉన్న కర్ణాటకలోకి చేరుతోంది. వరద ఇన్ ఫ్లో మరింతగా పెరిగే అవకాశం ఉంది.

పర్యావరణకు ప్రాధాన్యం

- మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి లలితకుమారి



మొక్కలు నాటుతున్న అధికారులు

సంగారెడ్డి జోన్: పర్యావరణ పరిరక్షణకు ప్రతీఒక్కరు మొక్కలు నాటి కృషి చేయాలని మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి లలిత కుమారి పిలుపునిచ్చారు. శనివారం సంగారెడ్డి కలెక్టరేట్ కార్యాలయం ఆవరణలో ఏక్ పెడ్ మాకే నామ్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాటిన మొక్కలను సంరక్షించేందుకు ప్రతీ ఒక్కరు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని ప్రతీ అంగన్ వాడీ సెంటర్ ఆవరణలో మొక్కలు నాటుతున్నామన్నారు. సోమవారం నుంచి జిల్లాలో పోషణ్ మాసం ప్రారంభమవుతోందన్నారు. నెల రోజులపాటు పలు శాఖల అధికారుల సమన్వయంతో వివిధ కార్యక్రమాలు చేపడతారని వివరించారు. కార్యక్రమంలో సీడీపీఓ చంద్రకళ, పోషణ్ అభియాన్ కోఆర్డినేటర్లు సౌమ్య, నవీన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఠాణాలో చైల్డ్ ఫ్రెండ్లీ కార్నర్

ఎస్పీ చెన్నూరి రూపేశ్

సంగారెడ్డి జోన్: జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్‌లో చైల్డ్ ఫ్రెండ్లీ కార్నర్లను ఏర్పాటు చేశామని ఎస్పీ చెన్నూరు రూపేశ్ పేర్కొన్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో జెజె యాక్ట్- 2015, చైల్డ్ ఫ్రెండ్లీ కార్నర్ పనితీరు, సీసీయల్స్ ఇంటర్వ్యూ (విచారణ)లో పోలీసుల పాత్రపై నల్సార్ యూనివర్సిటీ, యూనిసెఫ్, చైల్డ్ ప్రొటెక్షన్ రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో ఓరియంటేషన్ కార్యక్రమంనిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు పోలీసు శాఖ అహర్నిశలు కృషి చేస్తుందని చెప్పారు. ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ బాల కార్మికులకు విముక్తి కల్పించామని చెప్పారు. సీసీఎల్ విచారణ సమయంలో చైల్డ్ వెల్ఫేర్ పోలీస్ అధికారి యూనిఫాంలో ఉండకూడదని, వారిని పోలీస్‌స్టేషన్లో ఇంటర్వ్యూ చేస్తున్నామని తెలియకుండా వారిని ఆదుకునే విధానంలో ఫ్రెండ్లీ నేచర్లో ప్రశ్నించాలని సూచించారు. నల్సార్ యూనివర్సిటీ ప్రొఫెసర్ బాలకృష్ణ మాట్లాడుతూ బాల కార్మికులు, లేదా భిక్షాటన చేస్తున్న పిల్లలను గుర్తించి చదువుకునే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వెల్ఫేర్ అధికారి లలిత కుమారి, అదనపు ఎస్పీ సంజీవరావు, నల్సార్, యూనిసెఫ్ బృందం డేవిడ్ రాజ్, సీడబ్ల్యూసీ చైర్ పర్సన్ రాజారెడ్డి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ విజయ్ కృష్ణ, నార్కోటిక్ ఇన్‌స్పెక్టర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



రివార్డులు అందిస్తున్న ఎస్పీ రూపేశ్

పోలీసులకు రివార్డులు

జిల్లాలోని వివిధ కేసుల్లో నిందితులకు శిక్ష పడే విధంగా కృషి చేసిన పోలీసు అధికారులకు రివార్డులు అందించారు. శనివారం సంగారెడ్డిలో ఎస్పీ చెన్నూరు రూపేష్ పోలీసు అధికారులకు రివార్డులు అందించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నమోదైన పోక్సో, హత్యాయత్నం, దారి దోపిడీ వంటి వివిధ కేసుల్లో నిందితులకు శిక్ష పడేలా అధికారులు తమ విధులు నిర్వహించారని తెలిపారు. రివార్డులు అందుకున్న వారిలో కోర్టు లైజనింగ్ అధికారి కే.సత్యనారాయణ, కోర్టు డ్యూటీ హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, విఠల్ హెడ్, చందూరి రాజశేఖర్, కానిస్టేబుల్ కృష్ణ, మహేందర్, కిషన్ సింగ్, యాదుల్, భరోసా సిబ్బంది దేవలక్ష్మి ఉషారాణి, శాలిని, సౌజన్య, మహేశ్వరి తదితరులు ఉన్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి



అవగాహన కల్పిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి సూరికృష్ణ

సీనియర్ సివిల్ జడ్జి సూరికృష్ణ

జహీరాబాద్: చట్టాలపై ప్రతీ విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి సూరికృష్ణ అన్నారు. శనివారం పట్టణంలోని ఎంఆర్‌హెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలో చట్టాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతీ విద్యార్థి చదువుతో పాటు సాధారణ చట్టాలపై అవగాహన కలిగి ఉండడం ఎంతైనా అవసరమన్నారు. నిత్య జీవితంలో చిన్న చిన్న సమస్యలు ఎదురుకాకుండా ఉండడానికి, ఒక వేళ సమస్యలు వస్తే వాటిని అధిగమించడానికి చట్టాలు తోడ్పడతాయని సూచించారు. పోక్సో చట్టం, సమాచార హక్కు చట్టం, మోటారు వాహనాల చట్టం, బాలకార్మికుల నిర్మూలన చట్టం, బాల్య వివాహ నిరోధక చట్టం, జువైనైల్ జస్టిస్ యాక్ట్, ఉచిత న్యాయ సేవా సహాయం గురించి వివరించారు. ఏ సమాచారం గురించైనా తెలుసుకోవాలన్నా మండల లీగల్ సర్వీసెస్ కమిటీ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపాల్, న్యాయవాదులు శ్రీనివాస్‌ఖన్నా, సందీప్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, పాఠశాల ఇన్‌చార్జి రామకృష్ణ, లీగల్‌సెల్ సర్వీస్ సిబ్బంది, పారా లీగల్ వలంటీర్లు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'అల్లం' సమస్య మళ్లీ మొదటికి..

- కేరళ నుంచి దిగుమతి అవుతున్న పక్వానికి రాని ఉత్పత్తులు
- మార్కెట్లో రైతులకు దక్కని గిట్టుబాటు ధర



హైదరాబాద్‌లో వాహనంపై విక్రయిస్తున్న కేరళ నుంచి వచ్చిన పక్వానికి రాని అల్లం పంట

జహీరాబాద్: అల్లం ఉత్పత్తులకు మార్కెట్లో ధర లభించకుండా పోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్య మళ్లీ మొదటికి వచ్చినట్లు వారు పేర్కొంటున్నారు. జహీరాబాద్ ప్రాంతం నుంచి రైతులు భూమిలో నుంచి తీసిన అల్లం పంటను హైదరాబాద్ మార్కెట్‌కు తరలించుకుంటున్నా కేరళ రాష్ట్రం నుంచి వచ్చే లేత (మోద్) అల్లం మూలంగా ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి తరలించే పంటకు మార్కెట్‌లో డిమాండ్ పడిపోతున్నదని రైతులు ఆందోళన చెందుతున్నారు. క్వింటాలు ధర రూ.12 వేల నుంచి రూ.8వేలకు పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్ మార్కెట్‌కు అత్యధికంగా కేరళ రాష్ట్రం నుంచి అల్లం పంట దిగుమతి అవుతోంది. అక్కడి నుంచి మార్కెట్‌కు తీసుకువస్తున్న అల్లం ఉత్పత్తులను రెండు నెలల పాటు నిలిపివేయించి తమను న్యాయం చేయాలని జూలై 15వ తేదీన జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహకు జహీరాబాద్ ప్రాంత రైతులు వినతి పత్రం ఇచ్చారు. అప్పటి నుంచి లేత అల్లం పంటను కమీషన్ ఏజెంట్లు నిలిపి వేశారు. అయినా చిరు వ్యాపారులు, దళారులు మార్కెట్‌కు కేరళ నుంచి పక్వానికి రాని అల్లం పంటను తీసుకు వస్తుండడం, ఇది తక్కువ ధరకు లభిస్తున్న కారణంగా చిరు వ్యాపారులు, హోటళ్ల నిర్వాహకులు అక్కడి అల్లం కొంటున్నారు. కేరళ నుంచి తెస్తున్న లేత అల్లం పంటను చిరు వ్యాపారులు వాహనాలపై పెట్టి విక్రయాలు జరుపుతున్నారని, దీంతో జహీరాబాద్ ప్రాంతం నుంచి తీసుకెళుతున్న నాణ్యమైన అల్లం ఉత్పత్తులు అమ్ముడుపోని పరిస్థితి ఉందని రైతులు అంటున్నారు. మరో పక్షం రోజుల పాటు కేరళ నుంచి వచ్చే పక్వానికి రాని అల్లం ఉత్పత్తులను నిలిపి వేయించాలని, అక్కడి నుంచి వచ్చే నాణ్యమైన అల్లం తీసుకువచ్చినా తమకు అభ్యంతరం లేదని రైతులు ప్రభుత్వానికి సూచిస్తున్నారు.

మార్కెటింగ్ శాఖకు కమిషన్ ఏజెంట్ల లేఖ

ప్రభుత్వ సూచనల మేరకు కేరళ రాష్ట్రం నుంచి లేత అల్లం ఉత్పత్తులను తీసుకోకుండా ఉంటున్నామని, అయినా చిరు వ్యాపారులు తెప్పించుకుని విక్రయాలు జరుపుతున్నారని ఉస్మాన్‌గంజ్ కమీషన్ ఏజెంట్లు మార్కెటింగ్ శాఖకు లేఖ రాసినట్లు రైతులు పేర్కొన్నారు. రాష్ట్రంలోకి ప్రవేశించకుండా మార్కెటింగ్ శాఖ అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టక పోవడం వల్లే లేత అల్లం ఉత్పత్తులు దిగుమతి అవుతోందని లేఖలో ప్రస్తావించారు. దీంతో తాము తిరిగి దిగుమతి చేసుకోక తప్పని పరిస్థితి నెలకొందని కమీషన్ ఏజెంట్లు స్పష్టం చేసినట్లు వివరించారు.

తాము మార్కెట్‌కు తీసుకెళ్లిన అల్లం ఉత్పత్తులను డిమాండ్ లేదంటూ విక్రయించకుండా పక్కన పెడుతున్నారని వాపోతున్నారు. కేరళ నుంచి తీసుకు వచ్చే లేత అల్లం పంటను మార్కెట్లో కేవలం రూ.4వేలకు క్వింటాలు ధరకు విక్రయిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇలా విక్రయించడం వల్ల చిరు వ్యాపారులతో పాటు పెద్ద పెద్ద రెస్టారెంట్లకు సైతం లేత అల్లంనే ఉపయోగిస్తున్నారని పేర్కొంటున్నారు. లేత అల్లం దిగుమతులను పూర్తిగా నిలిపివేస్తే తమకు మంచి ధర లభించి కష్టాలు తీరుతాయని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

క్లుప్తంగా

యోగా పోటీల్లో విద్యార్థుల సత్తా


పతకాలతో విద్యార్థులు

గజ్వేల్‌రూరల్: సిద్దిపేటలో జరిగిన ఐదవ జిల్లా స్థాయి యోగా పోటీల్లో గజ్వేల్ విద్యార్థులు ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా శనివారం గజ్వేల్‌లో యోగా టీచర్ లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ.. తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యోగాసన భారత్ సహకారంతో జరిగిన పోటీల్లో బంగారు పతకంతోపాటు కన్సోలేషన్ బహుమతులను అందుకున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో సీనియర్ విభాగంలో యోగా టీచర్ బీ. శ్రీప్రసన్న బంగారు పతకంతోపాటు సాయి జీడీఆర్ పాఠశాలకు చెందిన విద్యార్థి శ్రీకరణ్, ప్రగతి సెంట్రల్ స్కూల్‌కు చెందిన సాదియ బేగం, మంజీరా స్కూల్‌కు చెందిన త్రిపుర, వేద స్కూల్(కుకునూర్‌పల్లి)కి చెందిన ఆనంద్ కన్సోలేషన్ బహుమతులను అందుకున్నారన్నారు. వీరితో పాటు మరో 15మంది ప్రశంసాపత్రాలను పొందినట్లు తెలిపారు.

దుబ్బాక అభివృద్ధికి కృషి

-మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్


పొన్నం ప్రభాకర్‌తో నాయకులు

దుబ్బాక: నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ మేరకు నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి మంత్రిని కలిసి నియోజకవర్గ అభివృద్ధిపై విన్నవించారు. తప్పకుండా నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులతోపాటు కొత్తగా చేపట్టనున్న పనులకు సంబంధించి నిధుల మంజూరికి చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు.

ఆటాడుకుందాం రా..!

- క్రీడలపై పెరుగుతున్న ఆసక్తి

పటాన్‌చెరు నియోజకవర్గంలో అనేక క్రీడా మైదానాలు, అకాడమీలు ఉన్నాయి. రోజురోజుకూ వీటికి డిమాండ్ పెరిగి ప్రాంగణాలన్నీ కిక్కిరిసిపోతున్నాయి. దీంతో మైదానాల అవసరం ఎక్కువ కావడంతో కొందరు క్రీడా అకాడమీలను ఏర్పాటు చేసి ఉపాధి పొందుతున్నారు. క్రీడా ప్రాంగణంలోని సౌకర్యాలు, కోచ్‌ను బట్టి అక్కడికి వచ్చే వారి నుంచి ఫీజులను వసూలు చేస్తున్నారు. కొంత మంది క్రీడా మైదానాలను గంటల వారీగా కూడా అద్దెకు ఇస్తున్నారు. ఉద్యోగస్తులు సెలవు దినాల్లో స్థలాన్ని అద్దెకు తీసుకొని వారికి నచ్చిన ఆటలను ఆడుకుంటున్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా మైదానాలు లేకపోవడంతో చాలా మంది ప్రైవేట్ క్రీడా అకాడమీలను ఆశ్రయిస్తున్నారు.


డీవీఆర్ స్పోర్ట్స్ క్లబ్‌లో..


వాలీబాల్ ఆడుతున్న ఉద్యోగులు

క్రీడలతో ఆరోగ్యం, క్రమ శిక్షణ..

ఈ పోటీ ప్రపంచంలో చిన్నారుల నుంచి పెద్దల వరకు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. దీంతో తల్లిదండ్రులు వారి చిన్నారులను క్రీడల్లో ప్రోత్సహిస్తున్నారు. క్రీడల్లో రాణించే వారికి బంగారు భవిష్యత్‌తో పాటు ఆరోగ్యం, క్రమశిక్ష వస్తుందని భావిస్తున్నారు. దానికి అనుగుణంగా అకాడమీల్లో చేర్పించే శిక్షణ ఇప్పిస్తున్నారు.

అద్దెకు క్రీడా మైదానాలు..

ఐటీ ఉద్యోగస్తులు సైతం క్రీడలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. నిత్యం పని ఒత్తిడితో ఉండేవాళ్లు సెలవు రోజుల్లో, సమయం దొరికినప్పుడు మైదానాలను అద్దెకు తీసుకొని ఆటలు ఆడుకుంటున్నారు. దీంతో నిర్వాహకులు ఉదయం, రాత్రి సమయాల్లో అద్దెకు ఇస్తున్నారు. అక్కడి సౌకర్యాలను బట్టి మైదానాలకు అద్దె నిర్ణయిస్తున్నారు. క్రికెట్ ఆటకు గంటకు రూ.500, ఫుట్‌బాల్ క్రీడకు రాత్రి సమయంలో రూ.3,000, ఉదయం సమయంలో రూ.1,500, వాలీబాల్ క్రీడకు గంటకు రూ.500 రుసుము తీసుకుంటున్నారు.





సరైన గ్రౌండ్‌లు లేకనే..

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వం క్రీడా మైదానాలను అభివృద్ధి చేయకపోవడంతో అనేక మంది క్రీడలకు దూరమవుతున్నారు. ప్రధానంగా గ్రామీణ క్రీడాకారులు డబ్బులు ఖర్చు పెట్టుకొని ప్రైవేట్ క్రీడా ప్రాంగణాలకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. క్రీడా మైదానాలు లేకపోవడంతో ప్రైవేట్ క్రీడా అకాడమీలకు మంచి డిమాండ్ వచ్చింది.

ప్రైవేట్ క్రీడా అకాడమీలకు డిమాండ్..

అనేక మంది యువకులు, క్రీడాకారులు అకాడమీలను ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు కోసం పట్టణ ప్రాంతలలో భూములను లీజుకు తీసుకొని క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి చేస్తున్నారు. మంచి శిక్షకులతో శిక్షణ అందిస్తున్నారు. వాటికి ఆదరణ ఎక్కువగా ఉండడంతో అనేక మంది ఈ రంగం వైపు మొగ్గు చూపుతున్నారు. ఉపాధితోపాటు మంచి క్రీడాకారులను తయారు చేస్తున్నామన్న సంతృప్తి పొందుతున్నారు.

కోచ్‌లతో ప్రత్యేక శిక్షణ..

ప్రధానంగా క్రీడా అకాడమీలో నైపుణ్యం కలిగిన కోచ్‌లతో శిక్షణ అందిస్తున్నారు. మెరుగైన సౌకర్యాలు ఉన్న క్రీడా అకాడమీల్లో బ్యాడ్మింటన్‌కు గంటకు రూ.400, నెల శిక్షణకు రూ.7 వేలు, బాక్స్ క్రికెట్‌కు ఉదయం గంటకు రూ.700, రాత్రి రూ.1,000, స్నూకర్ క్రీడలకు గంటకు రూ.250, వాలీవాల్ క్రీడకు నెలకు శిక్షణకు రూ.2 వేలు, స్కేటింగ్‌కు నెలకు రూ.2వేలు, జిమ్నాస్టిక్స్‌కు శిక్షణకు నెలకు రూ.1,500 రుసుము తీసుకుంటున్నారు.


విద్యార్థికి క్రికెట్‌లో మెలకువలు నేర్పుతున్న కోచ్

క్రీడలపై ఆసక్తిని పెంచాలి



నేటి ఆధునిక యుగంలో చిన్నారులు ఎక్కువగా వీడియో గేమ్స్, సెల్‌ఫోన్‌ల వైపు మొగ్గు చూపుతున్నారు. వారికి చిన్ననాటి నుంచి క్రీడలపై ఆసక్తి పెంచితే భవిష్యత్ వారికి నచ్చిన క్రీడల్లో రాణిస్తారు. దీంతో చిన్ననాటి నుంచి రోజుకు రెండు గంటల సమయంలో క్రీడల కోసం కేటాయించడం అలవాటుగా మారుతుంది.

– పీ.నాగరాజు, ఎస్‌9 స్పోర్ట్స్ అకాడమీ, యజమాని తెల్లాపూర్

రెండేళ్లుగా క్రికెట్‌లో శిక్షణ



మా కుమారుడు యశ్వంత్ శర్మ ఐదవ తరగతి చదువుతున్నాడు. రెండేళ్లుగా క్రికెట్‌లో శిక్షణ ఇప్పిస్తున్నాను. నిత్యం సాయంత్రం రెండు గంటలు క్రికెట్ కోసం సమయాన్ని కేటాయిస్తున్నాడు. దీని వల్ల చిన్నారులు చురుగ్గా, ఆరోగ్యం ఉంటారు.

– చంద్రబాబు శర్మ, భారతీనగర్ డివిజన్

తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలి



క్రీడల్లో రాణించే వారికి బంగారు భవిష్యత్ ఉంటుంది. చిన్నారులు విద్యతోపాటు క్రీడల్లో రాణించే విధంగా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. అథ్లెటిక్స్‌లో జాతీయ, రాష్ట్రస్థాయిలో 30 మెడల్స్ సాధించాను.

– ఏ.శాంతరావు, అథ్లెటిక్స్ క్రీడాకారుడు, డీవీఆర్ స్పోర్ట్స్ క్లబ్ కోచ్

పోరాటంతో హక్కులను సాధించుకోవాలి

– సాహసం రాష్ట్ర అధ్యక్షుడు ప్రకాశ్


మాట్లాడుతున్న ముప్పారం ప్రకాశ్

గజ్వేల్: పోరాట పటిమతో హక్కులను సాధించుకోవాలని సాహసం(సామాజిక హక్కుల సంఘం) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ముప్పరం ప్రకాశ్ అన్నారు. శనివారం గజ్వేల్‌లోని టీవైఆర్ లైబ్రరీ హాల్‌లో 'పదేళ్ల తెలంగాణ–ప్రజల స్థితిగతులు' అంశంపై నిర్వహించిన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో ప్రజలకు రాజ్యాంగబద్ధంగా అందాల్సిన హక్కులు అందటం లేదని, పాలకుల నిర్లక్ష్యం వల్లే ఇలా జరుగుతుందన్నారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో అన్ని వర్గాల ప్రజల హక్కులను కాలరాస్తున్నారని ఆరోపించారు. ఈ దుస్థితిని మార్చడానికి పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ప్రత్యేకించి సామాజిక హక్కుల పరిరక్షణే లక్ష్యంగా ఆవిర్భవించిన సాహసం అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటుందని తెలిపారు. హక్కులపై ప్రజా చైతన్యం కోసం నిరంతరం వివిధ కార్యక్రమాలతో ముందుకు సాగుతామన్నారు. టీవైఆర్ ఫౌండేషన్ చైర్మన్ టీ.రాజు మాట్లాడుతూ.. విద్యార్థులు, యువత చరిత్రను అధ్యయనం చేయాలన్నారు. సదస్సులో టీఎస్‌సీపీఎస్‌ఈయూ(తెలంగాణ కాంట్రీబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ యూనియన్) రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మల్లికార్జున్, సాహసం నాయకులు రమణాకర్, మల్లేశ్ యాదవ్, సోలమన్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

దైవ దర్శనానికి వెళ్తుండగా..

- కారును ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు
- ఒకే కుటుంబానికి చెందిన నలుగురికి తీవ్ర గాయాలు


సంగారెడ్డి: ప్రమాదానికి గురైన కారు

సంగారెడ్డి: ఆర్టీసీ బస్సు కారును ఢీకొట్టడంతో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన హత్నూర మండలం సిరిపురం గ్రామ శివారులో శనివారం చోటు చేసుకుంది. గుమ్మడిదల మండలం దాచారం గ్రామానికి చెందిన శ్రీనివాస్ రెడ్డి అతడి భార్య నర్మద, కూతురు శ్రీనిధి, తల్లి భ్రమరాంబతోపాటు కుమారుడు నర్సాపూర్ నుంచి మెదక్ జిల్లా చిలిప్‌చెడ్ మండలం చిట్కుల్ గ్రామ శివారులోని చాముండేశ్వరి దేవి దర్శనానికి కారులో వెళ్తున్నారు. సిరిపుర గ్రామ శివారులోని తెల్లరాళ్ల తండా గేటు సమీపంలోకి రాగానే జోగిపేట నుంచి ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు బోల్తా పడి నుజ్జునుజ్జయింది. ఇందులో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. కుమారుడికి ఎలాంటి గాయాలు కాలేదు. క్షతగాత్రులు స్థానికులు ఆస్పత్రికి తరలించారు.. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..

జహీరాబాద్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి చెందాడు. ఈ ఘటన మండలంలోని గోపన్‌పల్లి క్రాస్‌రోడ్డు వద్ద చోటు చేసుకుంది. చిరాగ్‌పల్లి పోలీసుల కథనం మేరకు.. మండలంలోని సత్వార్ గ్రామానికి చెందిన పెంటప్ప (65) గ్రామం నుంచి సైకిల్‌పై వెళ్తూ జాతీయ రహదారిని దాటుతున్నాడు. ఈ క్రమంలో వేగంగా వచ్చిన కారు వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

చికిత్స పొందుతూ ఖైదీ ..

సంగారెడ్డి టౌన్: చికిత్స పొందుతూ ఖైదీ మృతి చెందిన ఘటన సంగారెడ్డిలో చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై వినయ్ కుమార్ కథనం మేరకు.. జిల్లాలోని రామచంద్రాపురం పీఎస్‌లో కేసు నమోదైన ఘటనలో అదే గ్రామానికి చెందిన మిద్దె మహేశ్(19)కందిలో గల జైలులో అండర్ ట్రయల్ ఖైదీగా ఉన్నాడు. మహేశ్ కుమార్ అనారోగ్యానికి గురవడంతో 26న రాత్రి సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ 30న అర్ధరాత్రి మృతి చెందినట్లు ఎస్సై పేర్కొన్నారు. జైలు సూపరింటెండెంట్ భరత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బావిలో పడి వృద్ధురాలు

హుస్నాబాద్‌రూరల్: బావిలో పడి వృద్ధురాలు మృతి చెందిన ఘటన హుస్నాబాద్ మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మహేశ్ కథనం మేరకు. పొట్లపల్లి శివారు పల్లె దేవేందర్‌నగర్‌కి చెందిన జొన్నగడ్డల రామవ్వ(70) భర్త అంజయ్య పదేళ్ల కిందటనే మరణించగా కొడుకుల వద్దనే ఉంటుంది. అనారోగ్యంతో బాధపడుతున్న రామవ్వ శుక్రవారం రాత్రి ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. తల్లి కోసం కొడుకులు ఇద్దరూ చుట్టు పక్కల వెతుకుతుండగా బావిలో కన్పించింది. గ్రామస్తుల సమాచారం మేరకు పోలీసులు బావి నుంచి మృతదేహాన్ని బయటకు తీశారు.

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి...

మిరుదొడ్డి(దుబ్బాక): ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని అల్మాజీపూర్‌లో చోటు చేసుకుంది. శనివారం భూంపల్లి ఎస్‌ఐ హరీశ్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన గుర్మిళ్ల చంద్రయ్య (36) వ్యవసాయం చేసుకుంటూ మతిస్థిమితం లేని భార్య లక్ష్మి, కుమారుడు రమేశ్‌ను పోషించుకుంటున్నాడు. రెండు నెలల కిందట జరిగిన రోడ్డు ప్రమాదంలో చంద్రయ్య కాళ్లకు, చేతులకు తీవ్ర గాయాలై ఇంటి వద్దే ఉంటున్నాడు. కుటుంబ పోషణ భారం కావడంతో జీవితంపై విరక్తి చెంది 27న గుర్తు తెలియని గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు.


నంది అవార్డుకు ఉపాధ్యాయుడు ఎంపిక


మల్లికార్జునగౌడ్

టేక్మాల్(మెదక్): విద్యా రంగంలో, నిరుపేద విద్యార్థులకు పలు రకాల సేవలు చేసినందుకు వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురు బ్రహ్మ బంగారు నంది అవార్డుకు టేక్మాల్ మండల కుసంగి గ్రామానికి చెందిన పత్తిగారి మల్లికార్జున గౌడ్ ఎంపికైనట్లు శనివారం తెలిపారు. సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండల వెల్టూర్ ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న మల్లికార్జునగౌడ్‌కుఫౌండేషన్ ఆధ్వర్యంలో 8న రవీంద్రభారతీలో టీచర్స్ డే ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా అవార్డు అందించనున్నట్లు పేర్కొన్నారు. 20 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో చేసిన సేవలకు పలుమార్లు మండల, జిల్లా స్థాయి అవార్డులతోపాటు, లైయన్స్ క్లబ్, పలు ఫౌండేషన్‌ల అవార్డులు పొందినట్లు తెలిపారు. మల్లికార్జున్‌గౌడ్‌ను కుసంగి గ్రామస్తులపాటు తోటి ఉపాధ్యాయులు అభినందించారు.

తనిఖీలకు వస్తున్నారని ముందే మూసేశారు

పాపన్నపేటలో ప్రథమ చికిత్స కేంద్రాల తీరు


నార్సింగిలో మూసివేసిన ప్రథమ చికిత్స కేంద్రం వద్ద వైద్యాధికారులు

పాపన్నపేట(మెదక్): డెంగీ కేసులు పెరుగుతున్న వేళ వైద్య బృందాలు శనివారం తనిఖీలకు రావడంతో ముందస్తు సమాచారం అందుకున్న ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్స కేంద్రాలను మూసివేశారు. వివరాల్లోకి వెళ్తే.. పాపన్నపేట మండలంలో ఇటీవల డెంగీ కేసులు పెరిగాయి. ఈ నేపథ్యంలో ప్రథమ చికిత్స కేంద్రాల్లో జరుగుతున్న చికిత్సపై ఆరా తీసేందుకు జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ రమా ఆధ్వర్యంలో వైద్యాధికారులు తనిఖీలకి వచ్చారు. ఈ సమాచారాన్ని ముందస్తుగానే తెలుసుకున్న ఆర్‌ఎంపీలు, పీఎంపీలు తమ కేంద్రాలను మూసివేసి వెళ్లిపోయారు. ఆ కేంద్రాల్లో అనారోగ్యానికి గురైన వారికి కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాల్సి ఉంటుందని, సెలైన్లు, స్టెరాయిడ్లు, యాంటీబయాటిక్ చికిత్స అందించొద్దని, ఇన్‌పేషెంట్ సేవలు చేసే అవకాశం లేదని, హెల్త్ ఎడ్యుకేటర్ రమా తెలిపారు. ల్యాబ్‌లను సైతం తనిఖీ చేశారు. ఆమె వెంట డీపీఎంఓ కోట, పీహెచ్‌సీఓ చందర్, సిబ్బంది, రాజశ్రీ, శ్రీకాంత్, శ్రీనివాస్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

క్రీడా వేదికలను సద్వినియోగం చేసుకోవాలి

సిద్దిపేటఎడ్యుకేషన్: సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో శనివారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ విశ్వనాథం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత మాట్లాడారు. విద్యార్థుల సమగ్ర వికాసంలో క్రీడల పాత్ర ఎంతగానో ఉంటుందన్నారు. విద్యార్థులు శారీరక, మానసిక వికాసానికి ఇలాంటి క్రీడా వేదికలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. షటిల్ బ్యాడ్మింటన్, క్యారమ్స్, వాలీబాల్, చెస్ తదితర క్రీడల్లో పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పరీక్షల నియంత్రాణాధికారి డాక్టర్ గోపాలసుదర్శనం, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ మధుసూదన్, క్రీడా కమిటీ సభ్యులు కృష్ణయ్య, బాలికిషన్, డా.హరిబాబు, డా.మేరాజ్ ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్‌లోగా పనులు పూర్తి చేయండి

- విద్యుత్‌శాఖలో చేపట్టిన అభివృద్ధిపై సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలి
- టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫరూఖీ


మాట్లాడుతున్న ముషారఫ్ అలీ ఫరూఖీ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యుత్‌శాఖలో చేపట్టిన అన్ని రకాల అభివృద్ధి పనులను డిసెంబర్‌లోగా పూర్తి చేయాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్‌పీడీసీఎల్) సీఎండీ ముషారఫ్ అలీ ఫరూఖీ అన్నారు. శనివారం జిల్లా విద్యుత్ భవన్‌లో ఎస్‌ఈ, డీఈ, ఏడీఈ, ఏఈలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అంతకు ముందు పట్టణంలో వినియోగదారులతో విద్యుత్ సరఫరా, జీరో విద్యుత్ బిల్లు, తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. పట్టణ పరిసరాల్లోని వ్యవసాయదారులతో మాట్లాడి విద్యుత్ సరఫరా పై ఆరా తీశారు. నిర్మాణంలో ఉన్న సబ్ స్టేషన్‌ను పరిశీలించారు. విద్యుత్ డిమాండ్ సరఫరా, గృహ జ్యోతి పథకం అమలు, సర్కిల్‌లో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. అనంతరం ఫరూఖీ మాట్లాడుతూ.. వినియోగదారులతో సంస్థ ఉద్యోగులు, సిబ్బంది మర్యాదగా మాట్లాడాలన్నారు. రానున్న వేసవి సీజన్‌లో విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగే అవకాశముందన్నారు. ఫీల్డ్ అధికారులు విధిగా ట్రాన్స్ ఫార్మర్‌ల లోడ్‌ను చెక్ చేసి, ఓవర్ లోడైన వాటిని లోడ్ బ్యాలెన్సింగ్‌కు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో టీజీఎస్‌పీడీసీఎల్ సంస్థ డైరెక్టర్ (ఆపరేషన్) డాక్టర్ నర్సింహులు, రూరల్ జోన్ చీఫ్ ఇంజినీర్ భిక్షపతి, సిద్దిపేట సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ చంద్రమోహన్, డివిజనల్ ఇంజినీర్లు మహేశ్ కుమార్, లక్ష్మీ నారాయణ, శ్రీనాథ్, భాను ప్రకాశ్, ఏడీఈలు, ఏఈలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

జవాబుదారీగా పనిచేసే ప్రతీ అధికారి

- ప్రజల మన్ననలు పొందుతారు
- కలెక్టర్ రాహుల్‌రాజ్


కృష్ణమూర్తి దంపతులను సన్మానిస్తున్న కలెక్టర్

మెదక్ కలెక్టరేట్: జవాబుదారీగా పనిచేసే ప్రతీ అధికారి ప్రజల మన్ననలు పొందుతారని కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. శనివారం ఐడీఓసీ కార్యాలయంలో ఉద్యోగ విరమణ పొందిన పరిశ్రమల శాఖ అధికారి కృష్ణమూర్తి ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కృష్ణమూర్తి విధులపై నిబద్ధత, అంకిత భావం కలిగిన వ్యక్తి అని, ఐదేళ్లుగా విధులు నిర్వహించి తాను చేపట్టిన ఉద్యోగానికి వన్నె తెచ్చారని కొనియాడారు. అనంతరం జిల్లా నుంచి బదిలీపై వెళ్లిన అధికారులు హెల్త్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, డీఎఫ్ఓ రవి ప్రకాశ్, హార్టికల్చర్ నర్సయ్య, డీఎస్ఓ బ్రహ్మ రావును కలెక్టర్ శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జెడ్పీసీఈఓ ఎల్లయ్య, డీఈఓ రాధాకిషన్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య


రవి (ఫైల్)

చిన్నశంకరంపేట(మెదక్):ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ నారాయణ కథనం మేరకు.. అంబాజీపేట గ్రామానికి చెందిన మల్ల రవి(48) ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. శుక్రవారం తన సోదరుడు దేవానంద్‌ను డబ్బులు అడుగగా తన వద్ద లేవని చెప్పాడు. దీంతో మనస్తాపం చెందిన రవి గవ్వలపల్లిలోని వైన్స్‌లో మద్యం తీసుకొని పురుగుల మందు కలుపుకొని సేవించాడు. అనంతరం భార్య సుమితకు ఫోన్ చేసి చెప్పాడు. బంధువులు అతడి వద్దకు చేరుకొని నార్సింగిలోని ఓ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.